విజేతలకు జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానం





జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. 2022 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసిన విషయం విదితమే. ఉత్తమ నటుడిగా రిషబ్ శెట్టి (కాంతార), ఉత్తమ నటి అవార్డును నిత్యా మీనన్ (తిరుచిత్రంబలం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) సంయుక్తంగా రాష్టపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నిత్యా మాట్లాడుతూ 'దాదాపు పదిహేనేళ్ల కష్టానికి తగిన ప్రతిఫలం ఇది. నా సహ నటీనటులు, 'తిరుచిత్రంబలం' యూనిట్‌కు ఈ అవార్డును అంకితం ఇస్తున్నా' అన్నారు.

ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'ఎన్నికైన 'కార్తికేయ 2' చిత్రానికి దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ అవార్డులు స్వీకరించారు. ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం) అవార్డును 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికి గాను అందుకొన్నారు. 'నేను అందుకొన్న ఏడవ జాతీయ అవార్డ్ ఇది. ఇన్ని అవార్డులు తీసుకోవడానికి కారణమైన ఆ భగవంతుడికి, దర్శకనిర్మాతలకు నా కృతజ్ఞతలు' అన్నారు రెహమాన్. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా మిథున్ చక్రవర్తి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ 'ఈ రోజు దాదాపు 85 మంది అవార్డులు స్వీకరించారు. కానీ వాళ్లలో మహిళలు కేవలం 15 మందే ఉండడం విచారకరం. మహిళలు కూడా తమ ప్రతిభను ప్రదర్శించి చిత్ర పరిశ్రమలో తమ స్థానాన్ని బలపర్చుకోవాలి. సినిమాలు, సోషల్ మీడియా సమాజంలో మార్పు తీసుకువచ్చే మంచి సాధనాలుగా ఉపయోగపడాలి' అని అన్నారు.














తగ్గేదేలా!



అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2.. ద రూల్' చిత్రం శరవేగంతో తయారవుతోంది. ఈ సినిమా తొలి భాగం 'పుష్ప ..ద రైజ్' ఘన విజయం సాధించడంతో దేశవ్యాప్తంగా అందరి దృష్టి ఈ సినిమా మీదే ఉంది. అందుకే అంచనాలు అందుకొనేందుకు టీమ్ విశేషంగా కృషి చేస్తోంది. 'పుష్ప 2' ఫస్ట్ హాఫ్‌ను లాక్ చేశామని అంటూ కీలకమైన అప్‌డేట్‌ను మంగళవారం విడుదల చేశారు మేకర్స్. ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉందనీ, ప్రేక్షకులు ఎంత ఊహించుకున్నా అంతకు తగ్గేదేలే లా ఉందని అంటున్నారు. ఒక పక్క చిత్రీకరణ పూర్తి చేసుకుంటూనే మరో వైపు నిర్మాణానంతర పనులు శరవేగంతో జరుపుతున్నారు. డిసెంబర్ 6న చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు.

నిజమే గెలిచింది



తనతో పెళ్లికి నిరాకరించిందంటూ కథానాయిక మాల్వీ మల్హోత్రాపై కత్తితో దాడికి పాల్పడిన ఘటనలో నిర్మాత యోగేశ్ సింగ్‌ను దోషిగా తేల్చిన ముంబై కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై మాల్వీ ఆనందం వ్యక్తం చేశారు. తన పోరాటం ఫలించిందని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'ఈ పోరాటంలో ఎన్నో ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదుర్కొన్న నాకు తీర్పుతో ఉపశమనం లభించింది. నాలుగేళ్లుగా పోరాడుతున్నాను. ఎట్టకేలకు నిజం గెలిచింది. న్యాయం దక్కేవరకూ పోరాడే శక్తినిచ్చిన అమ్మవారికి ధన్యవాదాలు' అని మాల్వీ పేర్కొన్నారు. 2020లో తనతో పెళ్లికి నిరాకరించిందనే కారణంతో మాల్వీని అడ్డగించిన యోగేశ్ కత్తితో దాడి చేశాడు.

సమంతతో కలసి నటించాలనుంది



ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాల దర్శకత్వంలో కరణ్‌జోహార్, అపూర్వ మెహతా, ఆలియా భట్, సౌమెన్ మిశ్రా నిర్మించారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను రాజమౌళి, రామ్‌చరణ్ విడుదల చేశారు. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా త్రివిక్రమ్, రానా దగ్గుబాటి, సమంత విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ "ఆలియా నటనంటే నాకు చాలా ఇష్టం. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకుల ప్రేమను అలియా ఈ సినిమాతో మరోసారి సంపాదించుకుంటారు" అని చెప్పారు. "ఆన్ స్ర్కీన్, ఆఫ్ స్ర్కీన్ సమంత ఓ హీరో. సమంతతో కలసి నటించాలనుంది. నాకు, ఆమెకు సరిపడా స్ర్కిప్ట్‌ను త్రివిక్రమ్ రాస్తే బాగుండని పిస్తోంది. ఇది యాక్షన్, డ్రామా, ఎమోషన్ ఉన్న ఇంటెన్స్ సినిమా" అని ఆలియా భట్ అన్నారు.

ఇద్దరూ నాకు ఇష్టమైన హీరోయిన్లే!



నాకు ఇష్టమైన ఇద్దరు హీరోయిన్లు అలియాభట్, సమంత ఇక్కడే ఉన్నారు. ఈ సినిమా ట్రైలర్ అదిరిపోయింది. ట్రైలర్ చూస్తుంటే సినిమా పక్కా బ్లాక్‌బస్టర్ అవుతుందని అనిపిస్తోంది. రజనీకాంత్ అన్ని భాషల్లోనూ అభిమానుల్ని సంపాదించుకున్నారని తెలిసిందే. సమంత కూడా అలాగే అన్ని భాషల్లోని అభిమానుల మనసును గెలుచుకున్నారని అనిపిస్తోంది. సమంత ముంబయిలోనే కాకుండా హైదరాబాద్‌కు కూడా అప్పుడప్పుడూ వస్తే బాగుంటుంది. సమంత నటిస్తానంటే.. ఆమె కోసం రాయడానికి సిద్ధం. 'అత్తారింటికి దారేది' లాగా.. సమంత హైదరాబాద్‌కు రావాలంటే 'హైదరాబాద్‌కు దారేది' అనాలేమో. సమంత మూవీ సెట్స్‌లో ఓ డైనమేట్‌లా ఉంటారు. ఈ కార్యక్రమంలో అలియా కూడా డైనమేట్‌లా కనిపిస్తున్నారు" అని చెప్పారు.

ప్రసాదంతో పాటు.. మొక్కలు ఇవ్వండి..

● డిప్యూటీ సీఎం పవన్‌కు షిండే సూచన



ఆలయాల్లో ప్రసాదంతో పాటు ఒక మొక్క కూడా భక్తులకు ఇస్తే పచ్చదనాన్ని పెంపొందించవచ్చు అనే షాయాజీ షిండే సూచనను స్వాగతిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ప్రముఖ నటుడు షిండే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆలోచనలు విన్నపవన్‌కళ్యాణ్ ఇది అభినందనీయమైన ఆలోచన అని కొనియాడారు. ఆయనచేసిన సూచనల అమలుపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తామని చెప్పారు. వృక్షప్రసాద్ యోజనను మహారాష్ట్రలో మూడు ప్రముఖ ఆలయాల్లో అమలు చేస్తున్నారని షిండే వివరించారు. వాటి విశిష్టత గురించి మరాఠీలో రాసుకున్న కవితను పవన్‌కళ్యాణ్‌కు చదివి వినిపించారు. ఈ కవితను పవన్ కళ్యాణ్ ప్రశంసిస్తూ ఆ మరాఠీ కవితను తెలుగులో అనువదించి చెప్పారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

బామ్మను విమర్శించిన వ్యక్తికి అవార్డా?



కర్నాటక గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణకు ఈ యేడాది 'సంగీత కళానిధి' అవార్డును ప్రదానం చేయాలని మ్యూజిక్ అకాడమీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దివంగత కర్నాటక సంగీత దిగ్గజం ఎమ్మెస్ సుబ్బలక్ష్మి మనవడు వి. శ్రీనివాసన్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తన బామ్మను తీవ్రంగా విమర్శించడంతో పాటు హేతువాదిగా ఉంటున్న కృష్ణన్‌కు ఆ అవార్డును ప్రదానం చేయడం తగదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎమ్మెస్ సుబ్బులక్ష్మిని స్మరిస్తూ చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ, ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వాహకులు కలిసి 2005 నుంచి ప్రతియేటా ఆమె పేరుతో సంగీత కళానిధి అవార్డులను ప్రదానం చేయడం ఆనవాయితీ అని, అయితే ఆమెను తీవ్రంగా విమర్శించిన కృష్ణన్‌కు ఈ సారి అవార్డును ప్రదానం చేయకుండా ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ



మహిళా కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద అరెస్టై జైల్లో ఉన్న టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను రంగారెడ్డి జిల్లా కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్‌కు లభించిన అవార్డును కమిటీ తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో తమకు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ అవసరం లేదని ఆయన తరపు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో జానీ మాస్టర్‌కు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్‌ను నార్సింగి పోలీసులు వెనక్కి తీసుకున్నారు. జాతీయ పురస్కార అందుకునేందుకు ఢిల్లీకి వెళ్లేందుకు ఈ నెల 6 నుంచి 9 వరకూ జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. అయితే అవార్డును నిలిపివేయడంతో జానీ మాస్టర్ రిమాండ్‌లోనే కొనసాగుతున్నారు.

నాగసాధు పాత్రలో తమన్నా



'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటున్న 'ఓదెల 2' చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. మహాదేవుని ఆశీస్సులతో వారణాసిలో ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఓదెల మల్లన్న క్షేత్రంలో జరుగుతోంది. తన కెరీర్‌లోనే తొలిసారిగా తమన్నా ఇందులో శివశక్తి(నాగసాధు) పాత్ర పోషిస్తున్నారు. ఆమెతో పాటు మురళీశర్మ, హెబ్బా పటేల్ తదితరులు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. మల్లన్న ఆలయం, ఓదెల గ్రామంలోని అందమైన ప్రదేశాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు సంపత్‌నంది పర్యవేక్షణలో అశోక్ తేజ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని డి. మధు నిర్మిస్తున్నారు.

నవ్వుల్లో ముంచెత్తుతుంది



"విశ్వం' సినిమాతో పాత శ్రీను వైట్లను మళ్లీ చూడబోతున్నారు. ఈ సినిమాలో యాక్షన్, ఫన్, కామెడీ అద్భుతంగా వచ్చాయి. ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. 'విశ్వం' ఆద్యంతం నవ్వుల్లో ముంచెత్తుతుంది' అని హీరో గోపిచంద్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన చిత్రమిది. . టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ 'విశ్వప్రసాద్ గారి వల్ల సినిమాకు మరింత బలం చేకూరింది. శ్రీనువైట్ల స్ర్కిప్ట్ మీద ఏడు నెలలు పని చేశారు. ఆయనతో పని చేయడాన్ని ఆస్వాదించాను' అని చెప్పారు. శ్రీను వైట్ల మాట్లాడుతూ 'రెండున్నర గంటల్లో ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టదు. విశ్వ ప్రసాద్, వేణు నిర్మాణంలో రాజీ పడలేదు. ఈ హిట్‌తో దసరాని ఎంజాయ్ చేయబోతున్నాం' అని చెప్పారు. 'నేను అమెరికాలో ఉన్నప్పుడే శ్రీను వైట్ల గారి సినిమాలు బాగా చూసేవాణ్ణి. ఇప్పుడు ఆయనతో ఈ సినిమా చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రమిది' అని టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. 'విశ్వం పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ప్రేక్షకులకు పండుగ ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది' అని కావ్యథాపర్ తెలిపారు.



మెషీన్ లెర్నింగ్‌కు భౌతిక శాస్త్ర నోబెల్

జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు


జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్

స్టాక్‌హోం, అక్టోబరు 8: భౌతికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లను వరించింది. కృత్రిమ నాడీ వ్యవస్థలతో మెషీన్ లెర్నింగ్‌ను సాధ్యం చేసేలా వీరిద్దరూ సిద్ధాంతపరమైన ఆవిష్కరణలకు రూపకల్పన చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను మరింత అభివృద్ధి చేసే దిశగా చేసిన కృషికి గానూ వీరిద్దరినీ నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్టు స్టాక్‌హోంలోని నోబెల్ కమిటీ మంగళవారం వెల్లడించింది. ఏఐ గాడ్‌ఫాదర్‌గా పేరొందిన హింటన్.. టొరంటో వర్సిటీలో పనిచేస్తున్నారు. ఆయనకు కెనడా, బ్రిటన్ పౌరసత్వం ఉంది. ఇక అమెరికాకు చెందిన హోప్‌ఫీల్డ్ న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ వర్సిటీలో పనిచేస్తున్నారు. నాడీ వ్యవస్థపై ఈయన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందాయి. వీరిద్దరూ అభివృద్ధి చేసిన మెషీన్ లెర్నింగ్ వ్యవస్థ హోప్‌ఫీల్డ్ నెట్‌వర్క్‌గా ప్రసిద్ధి చెందింది. హోప్‌ఫీల్డ్.. సమాచారాన్ని నిల్వ చేయగల, పునర్నిర్మించగల సామర్థ్యం కలిగిన ఒక ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించారు. హింటన్.. డేటాలోని లక్షణాలను సొంతంగా గుర్తించగల పద్ధతిని కనుగొన్నారు. భౌతికశాస్త్రంలో ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌ను అనేక రకాలుగా ఉపయోగిస్తారని, కొత్త పదార్థాలను అభివృద్ధి చేయడానికి వీరి పరిశోధనలు తోడ్పడతాయని నోబెల్ కమిటీ హెడ్ ఎలన్ మూర్స్ తెలిపారు.

ప్రయాణంలో తోడునీడగా..

హైవేల వెంట ఫుడ్‌కోర్టులు, ట్రామా సెంటర్లు, ఫార్మసీలు: నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: జాతీయ రహదారిపై కార్లో వెళుతున్నపుడు సహజంగానే పిల్లలు ఆకలి అంటూ మారాం చేస్తుంటారు. వంటల్లో కల్తీ నూనె, నాసిరకమైన పదార్థాలు వాడతారనే భయంతో చిన్నారులపై పెద్దలు కన్నెర్ర చేస్తుంటారు. అయితే.. ఈ భయాలేవీ లేకుండా పిల్లలతో కలిసి పెద్దలు కూడా ఆ రోడ్డు పక్కనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫుడ్‌కోర్టులో భేషుగ్గా తినొచ్చు! అలాగే దారిలో అనారోగ్య సమస్య ఎదురైనప్పుడు.. ప్రమాదం సంభవించినప్పుడు కంగారుపడకుండా రోడ్డు పక్కనే ట్రామా సెంటరూ ఉంటుంది! ఈటరీలు, ట్రామా సెంటర్లే కాదు.. ఇబ్బందుల్లేని, సుఖవంతమైన ప్రయాణం కోసం ఫార్మసీలు, పెట్రోలు బంకులు, ఏటీఎంలు, రిపేర్ షాపులు, ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఇలా ఎన్నో వసతులను పూర్తిగా అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయరహదారులు, ఎక్స్‌ప్రెస్ వేల వెంబడి కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు జాతీయ రహదారుల వెంబడి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించేందుకు ఉద్దేశించిన 'హమ్ సఫర్' పాలసీని మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. హమ్ సఫర్ సేవలు అందించేవాళ్లు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వారికి పలు మినహాయింపులు ఉంటాయి. ప్రయాణికులు 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్ సాయంతో ఈ షాపుల లొకేషన్లను తెలుసుకోవచ్చు. అంతే కాకుండా షాపుల్లో, బంకుల్లో సేవలు, నాణ్యతపై ఈ యాప్ ద్వారా రేటింగ్ కూడా ఇవ్వొచ్చు. వీటిని తరచూ తనిఖీలు చేయడానికి ప్రత్యేక యంత్రాంగం ఉంటుంది. కాగా ఈ పాలసీ ఆవిష్కరణ సందర్భంగా గడ్కరీ మాట్లాడారు. రాన్నున్న రోజుల్లో రోడ్డు భద్రత, ప్రయాణ సౌకర్యాలకు 'హమ్ సఫర్' పర్యాయ పదంగా మారుతుందన్నారు. ఈ సౌకర్యాలన్నింటినీ పర్యావరణ హితమైన పద్ధతిలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. హమ్ సఫర్ పాలసీతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంతో పాటు ఉద్యోగాల సృష్టి జరుగుతుందని గడ్కరీ చెప్పారు. "ఎవరైతే ప్రయాణికుల నుంచి టోల్ వసూలు చేస్తారో.. వాళ్లు ప్రయాణికులకు భద్రత, సౌకర్యాలు కల్పించాలి" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పెట్రోలు బంకుల యజమానులు నిబంధనల ప్రకారం ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. హైవేలపై ఉన్న పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచడం తప్పనిసరని చెప్పారు. చాలా పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లకు తాళం వేసి ఉండటం తాను గమనించానని తెలిపారు. అలా ఉంటే పెట్రోల్ బంకులను మూసేస్తామని హెచ్చరించారు.





మరుపు లేఖ!



సాలూరు పోస్టాఫీస్

(సాలూరు రూరల్/
జియ్యమ్మవలస, అక్టోబరు 8)

- ఉత్తరం వస్తే ఎంత సరదానో..
- పోస్టుమన్ రాక కోసం ఎదురుచూపు
- నాడు ప్రధాన సమాచార సాధనం పోస్టుకార్డు
- సాంకేతికతతో కనుమరుగు
- డిజిటల్ సేవలో పోస్టల్ వ్యవస్థ
- నేడు ప్రపంచ తపాలా దినోత్సవం

ఒకప్పుడు ఉత్తరాలు, ఇన్‌ల్యాండ్ లెటర్లు, టెలిగ్రాం, మనీ ఆర్డర్లు వచ్చాయంటే ఆ సంతోషమే వేరు.. వాటికి తీసుకుని పోస్ట్‌మన్ ఇంటికి వస్తే ఆ సరదానే వేరు. కొన్నేళ్ల కిందట ఉత్తరాల కోసం ప్రజలు ఎదురు చూసేవారు. దూరం ప్రాంతంలో ఉన్న తన భర్తో, కొడుకో, బంధువులో ఏ కబురు ఉత్తరం ద్వారా పంపుతారనే ఆశతో పోస్ట్‌మన్ రాక కోసం పడిగాపులు కాసిన సందర్భాలు కోకోల్లలు. ఉదయం 11 గంటల తరువాత వచ్చే పోస్ట్‌మన్ కోసం వీధి చివర వరకు చూసే వారు. క్షేమ సమాచారాలు, శుభ, అశుభ వార్తలు నాడు ఉత్తరాలు, ఇన్‌ల్యాండ్ లెటర్లు, టెలిగ్రాం ద్వారానే తెలిసేది. మనీ ఆర్డర్ల ద్వారా డబ్బులు పంపించేవారు. అయితే సాంకేతికత అభివృద్ధి చెందడంతో ఉత్తరం.. ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది. నేడు ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..





పోస్టాఫీసుల్లో సెల్ఫ్‌లు ఇలా..



ఉత్తరం రావడం చూశా..

ఇంతవరకు నేను లెటర్ రాయలేదు. మా ఇంటి నుంచి ఉత్తరం రాలేదు. పోస్టుకార్డు, ఇన్‌ల్యాండ్ లెటర్లను పోస్టాఫీసుల్లో మాత్రమే చూశాను. కానీ నా చిన్నప్పుడు మా నాన్నకి ఉత్తరం రావడం చూశాను.

-జామి ఐశ్వర్య, దళాయివలస, గరుగుబిల్లి మండలం

ఎదురుచూసేవాళ్లం..



అప్పట్లో ఉత్తరాల కోసం ఎదురుచూసేవాళ్లం.. అందులో ఏ సమాచారం ఉందో అని చదవడానికి ఆసక్తి చూపేవాళ్లం. కుటుంబ సభ్యులు, బంధువుల యోగక్షేమాలు ఉత్తరాల ద్వారానే తెలిసేవి.

-రేవళ్ల అన్నపూర్ణమ్మ, వృద్ధురాలు, పెదబుడ్డిడి

కొండపై పోస్టాఫీసు..


భామిని: భామిని మండలంలో కొండ శిఖర గ్రామం మణిగలో పాఠశాల మినహా ప్రభుత్వ కార్యాలయాలు లేవు. అయితే రెండేళ్ల కిందట పోస్టాఫీసు ఏర్పాటు చేయడంతో గ్రామస్థులకు బ్యాంకింగ్ సేవలు అందుతున్నాయి. ఖాతాల్లో నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు చేసుకోగలుగుతున్నారు. ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన పథకాలు, ఉపాధి హామీ వేతనాలు, ఏటీఎం, ఆధార్ కార్డులను పొందగలుగుతున్నారు. ఇక్కడి పోస్టాఫీస్ కార్యాలయం సేవలను చుట్టుపక్కల గ్రామ ప్రజలు వినియోగించుకుంటున్నారు.



పోస్టుకార్డే ఆధారం..

'తోకలేని పిట్ట.. తొంభై ఊర్లు తిరుగుతుంది' అని ఉత్తరానికి(పోస్టుకార్డు)నానుడి. రెండు, మూడు దశాబ్దాల కిందట ఉత్తరమే ప్రధాన సమాచార సాధనం. చూడటానికి చిన్నదిగా ఉన్నా.. ఎంతో విలువైన సమాచారాన్ని మోసుకొచ్చేది. ఆ రోజుల్లో టెలిఫోన్‌లు ఎక్కడో పంచాయతీ ఆఫీసు వద్దనో, పోస్టల్ కార్యాలయం వద్దనో ఉండేవి. దీంతో పోస్ట్‌కార్డుపైనే చాలా మంది ఆధారపడేవారు. అయితే సాంకేతికత నేపథ్యంలో ఉత్తరాలు రాసుకునే తరం మారిపోయింది.

● గతంలో ప్రధాన కూడళ్ల వద్ద పోస్ట్‌బాక్సులు ఉండేవి. అక్కడి నుంచి రోజులో మూడుసార్లు పోస్ట్‌మెన్ ఉత్తరాలను తీసి పోస్టాఫీసు అల్మారాలో అమర్చేవారు. ఆ తర్వాత అడ్రాస్ ప్రకారం ఇంటింటికీ వెళ్లి ఉత్తరాలు, మనీఆర్డర్లు, టెలిగ్రామ్ ఇచ్చేవారు. అయితే మారిన కాలంతో పాటు పోస్టల్ సేవలు మారాయి. పోస్ట్‌మెన్‌కు జవాబుదారీతనం పెరిగింది. ఉత్తరాలు వస్తే ఆన్‌లైన్ చేసి మారి పంపిణీ చేస్తున్నారు. ఆధ్యాత్మిక, ఇతరత్రా పుస్తకాలు, వివిధ బ్యాంక్‌లు, బీమా సంస్థల నోటీసులు పోస్టల్ ద్వారా పంపుతున్నారు. పోస్టల్ ద్వారా బ్యాంకింగ్, బీమా సేవలు విస్తృతమ య్యాయి. పోస్టల్ కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా వినియోగదారులకు వివిధ పన్నులు చెల్లింపు తదితర 72 సేవలంది స్తున్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా వివిధ సంక్షేమ పథకాలు (ఉపాధిహామీ తదితర)కు చెందిన చెల్లింపులు జరుగుతున్నాయి. ఆధార్, జాతీయ జెండాల విక్రయాలు జరుపుతున్నారు. గ్రామాల్లో బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా పోస్టల్ సేవలు విస్తృతం చేస్తున్నారు.



పోస్టల్ కార్డ్, ఇన్‌ల్యాండ్ కవర్, ఎన్వలెప్ కవర్

పని పెరిగింది..



ఆధునికి సాంకేతికత, మొబైల్ రాకతో పోస్టల్ సేవలు రూపురేఖలు మారాయి. గతంలో కంటే పోస్టల్ సిబ్బందికి పని పెరిగింది. పనిలో జవాబుదారీతనం పెరిగింది. బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేస్తున్నాం. ఉత్తరాలు బట్వాడాలో బాధ్యతయుతంగా వ్యవహరిస్తున్నాం.

-దాసరి రత్నకుమార్, పోస్ట్‌మాస్టర్, సాలూరు


టెలిగ్రామ్ వచ్చిందంటే..



గతంలో టెలిగ్రామ్ వచ్చిందంటే కొద్దిగా ఆందోళన పడేవారు. అందులో శుభవార్త తక్కువగా ఉండేది. ఉత్తరం వస్తుందని పోస్ట్‌మన్ రాక కోసం ఎదురు చూసిన రోజులు ఉన్నాయి. ప్రస్తుతం రోజులు మారాయి. సెల్ ప్రపంచమే నడుస్తోంది.

-సంకుర్తి అప్పారావు, సాలూరు

భార్య ఉత్తరం కోసం ఎదురు చూసేవాడిని..



భార్య నుంచి ఉత్తరం వస్తుందని రోజు పోస్ట్‌మన్ కోసం ఎదురు చూసేవాడిని. టెలికాం ఉద్యోగిగా ఇచ్ఛాపురం, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల్లో పనిచేశాను. నా భార్య సాలూరులో మున్సిపల్ టీచర్‌గా అప్పట్లో (1971)లో రూ.74 జీతానికి పనిచేశారు. హైదరాబాద్‌లో ఉన్న తనకు ఇన్‌ల్యాండ్ కవర్‌లో రూ. 20 పెట్టి పంపిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఇన్‌ల్యాండ్ కవర్ కనిపించడం లేదు. అంతా మొబైల్ రాజ్యమే.

-పెదపాటి రాజారావు, రిటైర్డ్ టెలికాం ఏఈ, సాలూరు

ఆనందంగా ఉండేది..



చిన్ననాటి రోజుల్లో మా ఇంటికి ఉత్తరం, మనీ ఆర్డర్ వచ్చిందంటే ఎంతో ఆనందంగా ఉండేది. మా బంధువుల యోగక్షేమాలు చదివి వినిపించి సంతోషపడేవాళ్లం. ఆ రోజులు నిజంగా మర్చి పోలేనివి.

-రౌతు వాసుదేవరావు, రిటైర్డ్ టీచర్, పెదమేరంగి, జియ్యమ్మవలస మండలం

టెలిగ్రాం అంటేనే టెన్షన్..

సాధారణ సమాచారమైతే పోస్టుకార్డులు, ఇన్‌లాండ్ కవర్ల ద్వారా వచ్చేవి. టెలిగ్రాం వచ్చిందంటే ముందుగా ఆందోళన చెందేవాళ్లం. అనారోగ్య పరిస్థితుల్లో, ఎవరైనా చనిపోయిన సమయంలో టెలిగ్రాం ద్వారా సమాచారం పంపించేవారు. అవసరాలను బట్టి మనీ ఆర్డర్ ద్వారా డబ్బులు పంపించేవారు. **-బలివాడ మన్మథరావు, రిటైర్డ్ టీచర్, పాచిపెంట**

పటిష్ఠ బందోబస్తు: డీఐజీ

విజయనగరం క్రైం, అక్టోబరు 8: పైడిమాంబ సిరిమానోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి చెప్పారు. మంగళవారం పైడిమాంబ చదురుగుడితో పాటు సిరిమాను తిరిగే ప్రాంతాలను ఎస్పీ వకుల్‌జిందాల్, దేవస్థానం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పురాతన భవనాల పైనుంచి సిరిమాను తిలకించేందుకు అనుమతించబోమన్నారు. భవన యాజమానులు కూడా పోలీసులకు సహకరించాలని సూచించారు. భక్తులు, ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరిస్తే సిరిమానోత్సవం విజయవంతంగా పూర్తవుతుందన్నారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో డీవీ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

● బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో డీఐజీ సమీక్షించారు. తొక్కిసలాటలు, దొంగతనాలు, స్నాచింగ్‌లు జరగకుండా చూడాల న్నారు. సిరిమాను, ఇతర రథాలు తిరిగే ప్రాంతాల్లోకి భక్తులు రాకుండా 3 లేయర్లతో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు.



సిరిమాను తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఐజీ

పైడిమాంబకు ఘటాభిషేకం

- పైడితల్లి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు



ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

విజయనగరం రూరల్: పైడిమాంబకు ఘటాభిషేకాలు వైభవంగా సాగాయి. నగరంలోని హుకుంపేట, బూర్లెపేట, ఇప్పిలివీధి, లంకాపట్టణం, జొన్నగుడ్డి, సంతపేట యాదవవీధి, లంకవీధితో పాటు మరో 14 ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు మంగళవారం రాత్రి పైడిమాంబకు ఘటాభిషేకం నిర్వహించారు. ఈ తంతు జరిగినప్పుడు నలుచెరుగులా భక్త జనమే కనిపించారు. పైడిమాంబ నామస్మరణే వినిపించింది. విచిత్ర వేషాలు సందడి చేశాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కోట నుంచి మూడు లాంతర్లు, కొత్తపేట, గోకుల పార్కు రోడ్డు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరీ ఆలయం రోడ్డు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

● పైడిమాంబ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది.. సిరిమానోత్సవానికి వారంరోజులే సమయం ఉండడంతో భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులుతీరుతున్నారు. చదురుగుడి వద్ద ఉదయం 7 గంటల నుంచే భారీగా క్యూలో కనిపిస్తున్నారు. వేగంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వివిధ రకాల పండ్లు, పిండి పదార్థాలతో నైవేద్యం సమర్పించారు.

మహాలక్ష్మి అవతారంలో కోటదుర్గమ్మ

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి కోటదుర్గమ్మ మంగళవారం మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చింది. పాలకొండతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీప్రసాదశర్మ మహిళలతో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో దేవాలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

● సంబరాలతో హోరెత్తిన పాలకొండ

వీధి వారాలతోపాటు సంబరాలతో పాలకొండ పట్టణం హోరెత్తింది. స్థానికులు ఘటాలు, ముర్రాటలతో కోటదుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఊరేగింపులో అమ్మవారి వేషధారణలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మందుగుండు సామగ్రి కాల్చి భక్తులు సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.



ఇప్పటికి 365 దరఖాస్తులు

- నేటితో ముగియనున్న గడువు
- అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు



మాట్లాడుతున్న బాబ్జీరావు

సీతానగరం, అక్టోబరు 8 : జిల్లాలో 52 మద్యం షాపులకు గాను ఇప్పటివరకు 365 దరఖాస్తులు వచ్చినట్లు అబ్కారీశాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు తెలిపారు. విజయనగరం జిల్లాలో 153 షాపులకు 1800 పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. మంగళవారం సీతానగరం మండల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరి శీలించారు. సీతానగరం ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఇంతవరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలపై ఆరా తీశారు. దరఖాస్తుల స్వీకరణకు ఇంకా ఒక్కరోజే మిగిలి ఉందని చెప్పారు. ఈ నెల 11న పార్వతీపురంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తామని వెల్లడించారు. కాగా రాష్ట్రంలో ఎక్కువ దరఖాస్తులు వచ్చిన జిల్లాగా విజయనగరం ఉందని తెలిపారు. ఆయన వెంట సీఐ పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

ఏనుగుల హల్‌చల్

సీతానగరం, అక్టోబరు 8 : సీతానగరం మండలంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. మంగళవారం సూరమ్మపేట, తాన్న సీతారాంపురం, గుచ్చిమి గ్రామాలకు ఆనుకుని నీలగిరి తోటలు, కొండల సమీపంలో సంచరించాయి. వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. గజరాజులు రోడ్డు దాటితే చెరకు పంటను నాశనం చేస్తాయేమోనని జోగింపేట, లక్ష్మీపురం గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అటవీశాఖాధికారులు స్పందించి ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



గుచ్చిమి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న గజరాజులు



గోకులం షెడ్ల నిర్మాణ స్ట్రక్చర్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీవో

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, అక్టోబరు8: గోకులం షెడ్డుల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం గుమ్మడ, పులిపుట్టి, పెద్దబగ్గ, బొండి గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణా లను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పులిపుట్టిలో వైద్య శిబిరాన్ని పీవో పరిశీలించారు. అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని పీవో ఆదేశించారు. ఈ పరిశీలనలో ఇంజనీరింగ్ అధికారులున్నారు.

మద్యం షాపుల దరఖాస్తులకు నేడు ఆఖరు

సాలూరు రూరల్: మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవడానికి బుధవారమే తుది గడువని సాలూరు ఎక్సైజ్ సీఐ గులిపల్లి దాసు మంగళవారం తెలిపారు. సాలూరు సర్కిల్‌కు సంబంధించి ఇప్పటి వరకు 160 దరఖాస్తులు వచ్చాయన్నారు. మక్కువ మండలానికి సంబంధించి 71, పాచిపెంటకు 37, సాలూరు మండలానికి 20, సాలూరు మున్సిపాల్టీకి 32 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

● మద్యం షాపు కేటాయించిన రోజే లైసెన్స్‌కు సంబంధించిన పూర్తి మొత్తంలో ఆరో వంతు చెల్లించాల్సి ఉందని సీఐ చెప్పారు. మద్యం షాపుల కేటాయింపునకు ఈనెల 11న పార్వతీపురంలో లాటరీలో ఉంటుందని తెలిపారు.

మంత్రి దృష్టికి సమస్యలు

గరుగుబిల్లి: నీటి పారుదల శాఖలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి ఎస్.రామానాయుడుకు వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రాష్ట్ర వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె.కులంధర్, ప్రధాన కార్యదర్శి వి.గౌరునాయుడు, గౌరవధ్యక్షుడు డీజీ ప్రసాదరావు గత కొన్నాళ్లుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలియపర్చారు. ప్రాజెక్టుల పరిధిలోని ప్రధాన కాలువల పర్యవేక్షణకు లష్కర్ల నియామకం చేపట్టలేదని చెప్పారు. సిబ్బంది సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ జల వనరులశాఖ పరిధిలోని ప్రధాన సమస్యలు పరిష్కారంతో పాటు సిబ్బంది నియామకంపై దృష్టి సారిస్తున్నామని హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలిసిన వారిలో మురళీమోహన్, తదితరులు ఉన్నారు.

డయల్ యువర్ డీఎంకు వినతులు

పార్వతీపురంటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంలో ప్రజల నుంచి పలు వినతులు వచ్చినట్లు డిపో మేనేజర్ దుర్గ తెలిపారు. మధ్యాహ్నం పార్వతీపురం నుంచి విశాఖ వెళ్లే బస్సులు పాతబస్టాండ్ వరకు నడపాలని పలువురు కోరారు. అలాగే రాత్రి 10 గంటల తర్వాత విశాఖపట్నం నుంచి వచ్చే బస్సులను పాత బస్టాండు వరకు నడిపించాలని డీఎంకు విన్నవించుకున్నారు. పార్వతీపురం మండలంలోని సంగం వలస మీదుగా వెలగవలసకు బస్సు నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరారు. పార్వతీపురం బస్‌స్టేషన్ ఇన్, ఔట్ గేట్ల వద్ద రాత్రి సమయంలో లైటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు విన్నవించారు. తాడికొండకు ఉదయంతో పాటు మధ్యాహ్నం సమయాల్లో బస్సులు నడపాలని, ఆయా గిరిజన గ్రామాల ప్రజలు తెలిపారు. గౌరీపురం గ్రామంలో ఈనెల 18, 19, 20వ తేదీల్లో గ్రామదేవత పండుగ సందర్భంగా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, ఆ గ్రామ ప్రజలు వేడుకున్నారు. సీతానగరం మండలం అజ్జాడ గ్రామానికి నైట్ హాల్టు బస్సులను నడపాలని పలువురు డీఎంను కోరారు.

డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వడానికి సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎండీ గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌లో శిక్షణ ఉంటుందని చెప్పారు. గత డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లకు శిక్షణ ఇచ్చి ఉండాలనే నిబంధనలు విధించారని తెలిపారు. డీఎస్సీ శిక్షణా సంస్థలను జాబితాలోకి చేరడానికి పూర్తి వివరాలను https//tendar.apeprocurtment.gov.inలో అప్‌లోడ్ చేశామన్నారు. ఆసక్తి ఉన్న శిక్షణా సంస్థలు ఇతర వివరాల కోసం ఈవోఐ డాక్యుమెంట్‌ను ఏపీఈ-ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని వివరించారు. ఈనెల 21లోగా దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సాలూరు రూరల్: సాలూరులోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన 1991 బ్యాచ్ విద్యార్థులంతా మంగళవారం స్థానిక కోదండరామ కల్యాణమండపంలో ఉత్సాహ-2024 పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 150 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని, సందడి చేశారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై గేట్ మీటింగ్ నిర్వహించారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా చైర్మన్ కె.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్.రావు, డిపో అధ్యక్ష, కార్యదర్శి సుబ్బారావు, వి.రాజేష్, ఎం.వైకుంతం, ఎస్‌టీ రావు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

వీరఘట్టం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మంగళవారం రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సహకారంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో డి.వెంకటరావు, గ్రామాలు ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● **సీతంపేట రూరల్:** గ్రామాల అభివృద్ధిలో భాగంగా చేపట్టవలసిన పనులపై ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు వైటీసీలో రెండు రోజులు ఇస్తున్న శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఈవోపీఆర్డీ సత్యం.. గ్రామసభ నిర్వహణ వంటి అంశాలపై ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఈ శిక్షణా తరగతుల్లో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **భామిని:** పంచాయతీరాజ్-1994 చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఈవోఆర్డీ కె.కృష్ణారావు కోరారు. మంగళవారం ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రీఫ్రెసెఎస్ శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. పంచాయతీ సమావేశాలు గ్రామసభలు, శానిటేషన్, డ్రింకింగ్ వాటర్ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాసరావు, జి.సంతోష్, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు గుమ్మలక్ష్మీపురంలో శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 27 పంచాయతీలకు చెందిన ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు ఈనెల 9, 10 తేదీల్లో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీవో సాల్మన్‌రాజ్ తెలిపారు. ఈ శిక్షణ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలస్వామి

రాయగడ: వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యతని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. మంగళవారం స్థానిక ఫారెస్ట్ పార్కులో వన్యప్రాణుల వారోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. అడవుల రక్షణ కోసం పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. అటవీ శాఖాధికారి సచిన్ అన్నా సాహెబ్ ఓవల్ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ కోసం ఆరు నెలల్లో 25వేల కిలోమీటర్ల మేర గస్తీ నిర్వహించామని తెలిపారు. అనంతరం గత కొంతకాలంగా పర్యావరణ పరిరక్షణకు సేవలందిస్తున్న వివిధ సంఘాలకు జిల్లా పర్యావరణ సంస్థ తరపున చెక్కులను అందజేశారు. వన్యప్రాణుల సంరక్షణ మానవ బాధ్యత అనే అంశంపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలో గెలుపొందిన వారికి బహుమతులను, ప్రశాంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, కొల్నార సమితి అధ్యక్షురాలు సంయుక్త కులసిక, అన్ని రేంజర్ల అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా

మహాలక్ష్మిగా దుర్గమ్మ

● కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
● మొక్కులు చెల్లించుకున్న భక్తులు
● మండపాల్లో ప్రత్యేక పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. భక్తులు మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



వీరఘట్టం: మహాలక్ష్మి అవతారంలో దుర్గమ్మ



సాలూరు రూరల్: మహాలక్ష్మిగా సంతోషిమాత



మక్కువ: లలితా త్రిపుర సుందరిదేవిగా శంబర పోలమాంబ



పాలకొండ: సంబరాల్లో అమ్మవారి వేషధారణతో నృత్యాలు



బలిజిపేట: మహాలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న దేవి



పాలకొండ: కోటదుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ స్పీకర్ తమ్మినేని కుటుంబ సభ్యులు

పాలకావిళ్లతో తిరువీధి

సాలూరు రూరల్: దసరా ఉత్సవాల నేపథ్యంలో మామిడిపల్లి గ్రామంలో మంగళవారం భవానీ దీక్షాదారులు పాలకావిళ్లతో తిరువీధి నిర్వహించారు. ప్రతి ఏటా అమ్మవారి పాలకావిళ్లలో తిరువీధి నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది 56 మంది భవానీ దీక్షాదారులు పాలకావిళ్ల ధరించి అమ్మవారి కీర్తనలతో మామిడిపల్లిలో తిరువీధి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు.



పాలకావిళ్లతో తిరువీధి నిర్వహిస్తున్న భవానీ స్వాములు

నూతన బస్సులు ప్రారంభం



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: పాలకొండ ఆర్టీసీ డిపో నుంచి నూతన బస్సులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం ప్రారంభించారు. పాలకొండ నుంచి రాజాం మీదుగా బలిజిపేటకు పల్లె వెలుగు బస్సు, పాలకొండ నుంచి విజయవాడకు సూపర్‌లగ్జరీ బస్సు ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా బస్సును డ్రైవ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో కె.శ్రీనివాసరావు, పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, పాలకొండ డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, పాలకొండ డిపో అసిస్టెంట్ ఎంకేఎం రాజు, యూనియన్ నాయకులు బాసూరు కృష్ణమూర్తి, బూరాడ వెంకటరమణ, వావిలపల్లి రాజేష్, జి.విజయబాబు, ఎం.సుబ్బారావు, ఎం.విద్యాసాగర్, వివిధ పార్టీ నాయకులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సీతంపేట రూరల్: సీతంపేట ఏరియా ఆసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, భాస్కరరరావు డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీతంపేట ఏజెన్సీలో విషజ్వరాలతో గిరిజను లు మృత్యువాత పడుతున్నా వైద్య, ఆరోగ్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రించడం సరికాదని విమర్శించారు. సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రోగులకు సరిపడా బెడ్స్ లేక జ్వరపీడితులు మందులు తీసుకుని ఇళ్లకు వెళ్లవలసి వస్తుందని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం నాయకుడు సాంబయ్య ఉన్నారు.

జనసేన నాయకుల సాయం

బలిజిపేట: తుమరాడ గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న నండ సూరప్పడుకు జనసేన నాయకులు సాయం చేశారు. రూ.2వేలు, 25 కేజీల బియ్యం, నెలకు సరిపోయే నిత్యావసర వస్తువులు మంగళవారం అందజేశారు. నొడగాన తాతబాబు, మర్రాపు సురేష్, వాసిరెడ్డి సాయి మోహన్, పడాల జయరాం, ఎడ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంప ఆలయానికి రహదారి సౌకర్యం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ: కోటిపాం గ్రామం నుంచి గుంప సోమేశ్వరస్వామి ఆలయం వరకు నిర్మించనున్న రహదారి పనులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాలకు భక్తులు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూ.1కోటి 20లక్షల వ్యయంతో బీటీ రోడ్డు మంజూరు చేసిందని చెప్పారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే కోటిపాం కొండపై ఉన్న సత్యనారాయణస్వామి ఆలయానికి రూ.40లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణ పనులకు కూడా ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర పాత్రుడు, పార్టీ నాయకులు వెంపటాపు భారతి, డి.వెంకటనాయుడు, జి.సుదర్శన రావు, పి.వెంకటనాయుడు, ఎన్.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

వినతులను సకాలంలో పరిష్కరించాలి

● ఎమ్మెల్యే జగదీశ్వరి ● కూనేరులో ప్రత్యేక గ్రీవెన్స్

కొమరాడ: ప్రజల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధికారులను ఆదేశించారు. మండలంలోని కూనేరు గ్రామంలో ఆమె మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 183 దరఖాస్తులను అందజేశారు. సంబంధిత శాఖలవారీగా వచ్చిన ఫిర్యాదులు ఇలా ఉన్నాయి. ఎంపీడీవోకి సంబంధించిన దరఖాస్తులు 45, రెవెన్యూకి 37, గృహ నిర్మాణానికి 58, గ్రామీణ నీటి సరఫరాకి 7, విద్యుత్‌శాఖకు 5, మండల విద్యాశాఖకు 7, ఐసీడీఎస్‌కు 2, ఐటీడీఏ ఇంజనీరింగ్‌కి 2, ఇరిగేషన్‌కి 2 ఫిర్యాదులు ప్రజల నుంచి వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ శివయ్యతో పాటు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. అలాగే మండల పార్టీ కన్వీనర్ ఉదయశేఖరపాత్రుడు, టీడీపీ నాయకులు పి.వెంకటినాయుడు, వి.భారతమ్మ, సదుర్శనరావు, మధుసూదనరావు, డి.వెంకటినాయుడు, తమ్మయ్యతో పాటు కూటమి నాయకులు హాజరయ్యారు.

ఆ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

బెలగాం: తమిళనాడులోని ఓ సంస్థలో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగు వారాలుగా సమ్మె చేస్తుంటే కనీసం పట్టించుకోని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకుడు జి.వెంకటరమణ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

వరద బాధితులకు ఆర్థిక సాయం

గరుగుబిల్లి: విజయవాడలోని వరద బాధితులకు గాయత్రీ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆర్థిక సాయం అందించింది. మంగళవారం విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు పి.హనుమంతరావుకు రూ.35 వేలు అందించారు. జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరరావు, జి.బాబూరావు, మండల గౌరవధ్యక్షుడు సీహెచ్ తవిటాచారి, బి.బ్రహ్మాజీ, ఎ.కాశీ విశ్వేశ్వరరావు, బి.శంకరరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు

కురుపాం రూరల్: ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపొద్దని వైడీవో నెట్‌వర్క్ ఔట్‌రీచ్ వర్కర్ అడ్డాకుల గీతారాణి అన్నారు. మీకు తెలుసా పేరుతో మంగళవారం దురుబిలి గ్రామంలో ఆమె గిరిజన యువతకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రావడానికి గల కారణాలు, ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

చెల్లింపేటలో సీపీఎం మహాసభ

బలిజిపేట: చెల్లింపేటలో సీపీఎం శాఖ మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సభ్యుడు పారిశర్ల పారినాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు మాట్లాడారు. శివరాంపురం, చెల్లింపేట పంచాయతీలో తాగునీరు, సాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలపై దృష్టి పెట్టాలని తీర్మానం చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ

సాలూరు రూరల్: పి.కోనవలస వద్ద నిర్వహిస్తున్న వ్యవసాయ మార్కెటింగ్ చెక్‌పోస్ట్, అటవీ చెక్‌పోస్టులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు (శ్రీకాకుళం) మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా చెక్‌పోస్టుల గుండా రవాణా అయ్యే సరుకుల వివరాలను పరిశీలించారు. ఏ వస్తువు అనధికారంగా సరిహద్దు దాటి ఒడిశాకు వెళ్లరాదన్నారు. ఒడిశా నుంచి కూడా అనధికారంగా సరుకులు రాకూడదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నిర్వాహకుల నుంచి ట్రోఫీ అందుకుంటున్న రిబిక

భామిని: రాష్ట్ర స్థాయి మహిళా అండర్-19 కబడ్డీ పోటీల్లో భామిని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని ఎ.రిబిక జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ మంగళవారం తెలిపారు. గత రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. దీంతో పీడీ జి.శివరాంప్రసాద్, ఎంపికైన విద్యార్థినిని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

సాగులో మెలకువలు తెలుసుకోండి

సాలూరు రూరల్: రైతులు సాగులో మెలకువలు తెలుసుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ రాబర్ట్‌పాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మామిడిపల్లి, అన్నంరాజువలసలో సాలూరు ఏవో అనురాధ పండా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఏడీఏ మధుసూదనరావు తదతరులు పాల్గొన్నారు. ● **మక్కువ:** మండలంలోని నంద గ్రామంలో మొక్కజొన్న పంట నష్టపోయిన క్షేత్రాలను జిల్లా వ్యవసాయాధికారి అధికారి కె.రాబర్ట్‌పాల్ మంగళవారం సందర్శించారు. పంట నష్టానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శాస్త్రవేత్తల పరిశీలనలో పంట ఎందుకు నష్టపోయిందో తెలుస్తుందన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఈ కార్య క్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి, సాలూరు క్లస్టర్ ఏడీ మధుసూదనరావు, మండల వ్యవసాయాధికారి బొత్స శ్రీనివాసరావు, మొక్కజొన్న కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ● **సీతంపేట రూరల్:** మండలంలోని తుంబికొండ, మానాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ గిరిజన రైతులకు వ్యవసాయంలో దిగుబడి పెంచుకోవడానికి అవసరమైన సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, మండల వ్యవసాయ శాఖాధికారిణి శ్రీదేవి, వీఏఏ పావని, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి
● వైద్య కేంద్రాల్లో ఆశా డే

సీతంపేట రూరల్: గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి అన్నారు. హడ్డుబంగి సచివాలయం సబ్ సెంటర్లను ఆమె మంగళవారం సందర్శించారు. సబ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఆశాల విధులపై వివరించారు. అనంతరం మర్రిపాడు పీహెచ్‌సీని సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య తనిఖీలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆమెతో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి: డీఐవో



అవగాహన కల్పిస్తున్న డీఐవో నారాయణ

గరుగుబిల్లి: పీహెచ్‌సీల పరిధిలోని రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని డీఐవో ఎం.నారాయణ సూచించారు. మంగళవారం రావివలస పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, దీర్ఘకాలిక రోగులపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. హైరిస్క్ ఆరోగ్య సమస్యలు గుర్తించిన వెంటనే ఉన్నత స్థాయి సిబ్బందికి తెలియపర్చి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ కె.కార్తీక్, సూపర్‌వైజర్లు ప్రకాష్, జయగౌడ్, సన్యాసమ్మ, జి.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వీరఘట్టం: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ వినోద్ మాట్లాడుతూ గర్భిణులకు అంగన్‌వాడీ ద్వారా అందజేసే పౌష్టికాహారం ప్రతిఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు పాలవలస ఉమామహేశ్వరి, ప్రదీప్‌కుమార్, హెచ్‌వీ శాంతికుమారి, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు, ఆశ కార్యకర్తల పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న జగన్మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యమని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. దుడ్డుకల్లు పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని, పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. గ్రామాల్లో తాగునీటి స్వచ్ఛత పరీక్షలు ప్రతివారం నిర్వహించాలని, కలుషితాన్ని గుర్తిస్తే తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బి.శైలజస్వాతి, ఏఎంవో సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు సత్యరాజ్, పెంటమ్మ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉండాలి

సాలూరు రూరల్: ప్రజారోగ్యం పరిరక్షణకు మందులు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ చెక్కా సత్యనారాయణ అన్నారు. ఆయన మంగళవారం సాలూరులో వార్డు ఆరోగ్య కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి పరిధిలో జ్వరాలపై ఆరా తీశారు. ఆరోగ్య కార్యదర్శుల వద్ద కనీస స్థాయిలోనైనా మందులు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో 13 మంది ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు. ● సాలూరు పట్టణానికి నీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతు వల్ల బుధవారం ఒక్కరోజు నీటి సరఫరా ఉండదని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

● వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని మామిడిపల్లి వైద్యాధికారి శివకుమార్, వైద్యురాలు హిమబిందు అన్నారు. మామిడిపల్లి పీహెచ్‌సీలో మంగళవారం వారు ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈవో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కందులపథంలో వైద్యశిబిరం

కందులపథంలో మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యా ధికారి మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 47 మంది కి వైద్య సేవలందించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన సూచనలు ఇచ్చారు. గ్రామస్థులు పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల నివారణకు పరిశుభ్రతే ప్రథమ మెట్టు అన్నారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300








పైడితల్లికి మొక్కుల చెల్లింపు

(విజయనగరం రూరల్)

పైడిమాంబ అమ్మవారికి ఘటాభిషేకాలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ తంతులో భాగంగా మంగళవారం పులివేశాలు, విచిత్రవేషధారణలు, రాక్షస బొమ్మల ప్రదర్శనలు, కత్తిసాము వీరుల సాహసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేలాది మంది భక్తుల కోలాహలం నడుమ మొక్కుల చెల్లింపు ప్రక్రియ సాగింది. ఆలయం చుట్టుపక్కల రోడ్డులన్నీ భక్తులతో నిండిపోయాయి.

సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు
- ప్రజాదర్బార్‌లో వినతులు ఇచ్చేందుకు పోటెత్తిన ప్రజలు

విజయనగరం రూరల్, అక్టోబరు 8: ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు నగరంలోని వివిధ డివిజన్లలో నివసిస్తున్న ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమంలో భాగంగా ప్రజాదర్బార్‌ను ఆమె నిర్వహించారు. ఇటీవల తొలి విడతలో భాగంగా 1 నుంచి 15 డివిజన్ల వరకూ 13వ డివిజన్ పరిధిలోని సచివాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించగా, 16 నుంచి 30వ డివిజన్ల వరకూ వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని మంగళవారం బొడ్డువారి జంక్షన్‌లో ఉన్న కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్‌లో 150 పైగా వినతులు వచ్చాయి. ఆరోగ్య శ్రీ, ఇళ్లు, ఇంటిరుణాలు, రేషన్‌కార్డులు, సామాజిక పెన్షన్లు తదితర వాటికి సంబంధించి ఎక్కువ వినతులు వచ్చాయి. వినతులు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో కొన్ని సమస్యలు పరిష్కారం జరిగే అవకాశం ఉందన్నారు. పెన్షన్లు, ఇళ్లు అనేవి ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం పై ఆధారపడి ఉన్నాయని, ప్రభుత్వం ప్రకటించిన వెంటనే వీరి దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రజాదర్బార్‌లో ప్రజలిచ్చిన వినతులను ఆన్‌లైన్ చేసి ఉంచుతామన్నారు. నగరంలోని 50 డివిజన్లకు గాను ఇంత వరకూ 30 డివిజన్ల పరిధిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించామని, మిగతా 20 డివిజన్ల పరిధిలో త్వరలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి సమస్యలను తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కంది మురళీనాయుడు, డివిజన్ల ఇన్‌చార్జిలు, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, టీడీపీ నగర నాయకులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అదితి, హాజరైన ప్రజలు

ప్రతి వినతిని ఆన్‌లైన్ చేయాలి

- ప్రజాదర్బార్‌లో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను అధికారులు ఆన్‌లైన్ చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమస్యలైనా, సామాజిక సమస్యలైనా ప్రజలు నోటిమాటతో కాకుండా దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ప్రతి సమస్యపై పరిష్కారం చూపే విధంగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రజాదర్బార్‌లో అధికంగా రెవెన్యూ సమస్యలే రావడం విశేషం. సుమారు 129 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో ఆర్‌డబ్ల్యుఎస్-10, ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించి-18, హౌసింగ్-4: ఇరిగేషన్-2, పంచాయతీరాజ్-11, రెవెన్యూకు సంబంధించి-72 సమస్యలు వచ్చాయి. జోగిందొరవలస, కర్రిందొరవలస, గొల్లలపేట గ్రామాల్లో అనధికారికంగా డీపట్టా భూములు అమ్మకాలు జరిపారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని జోగిందొరవలస గ్రామానికి చెందిన జోగయ్య, మరికొంతమంది గిరిజనులు ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందించారు. ఆరికతోట శ్మశాన సమస్యపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పల్లా చంద్ర, నల్లా కూర్మారావు, మరి కొంతమంది వినతిపత్రం ఇచ్చారు. ఆరికతోటలో మంచినీటి సమస్యపై జనసేన నాయకులు కనకల శ్యామ్, అల్లు రమేష్‌లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, కర్రోతు తిరుపతిరావు, కనిమెరక శంకరరావు, విజయభాస్కర్‌తోపాటు తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎంపీడీవో రత్నం, హౌసింగ్ డీఈ అప్పయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జోగిందొరవలస గిరిజనులు

సినిమా పాటలు చూపిస్తూ బ్రెయిన్ సర్జరీ

- రాజాం కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

రాజాం రూరల్: పట్టణంలోని జీఎంఆర్ కేర్ ఆసుపత్రి వైద్యులు ఓ మహిళకు అరుదైన బ్రెయిన్ సర్జరీ చేసి విజయం సాధించారు. రోగి మెలకువగా ఉండగానే ఆమెకు తెలుగు సినిమా వీడియో సాంగ్స్ చూపిస్తూ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ విషయాలను ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ రాజేంద్ర న్యూరో సర్జన్ డా.వినోద్, మత్తు వైద్యులు కిరణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్జరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వారు అందించిన సమాచారం ప్రకారం.. పట్టణానికి చెందిన నల్ల సత్యవతి నాలుగు రోజుల క్రితం ఓ కాలు, ఓ చేయి పనిచేయడం లేదని బంధువులతో కలిసి రాజాంలోని కేర్ ఆసుపత్రికి వచ్చారు. ఎమర్జెన్సీలో ఆమె పరిస్థితిని పరిశీలించిన వైద్యులు ఆమె మెదడులో రక్తస్రావం జరుగుతుందని గుర్తించారు. ఆమె మెదడుకు సర్జరీ చేయాల్సి ఉందని నిర్ధారించారు. అయితే ఆమెకు మత్తు ఇస్తే తట్టుకునే పరిస్థితి లేదని, ఇతర శారీరక సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని ఓ నిర్ణయానికి వచ్చారు. దీంతో రోగి కుటుంబ సభ్యులతో చర్చించిన ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డా.రాజేంద్ర రోగి మెలకువగా ఉండగానే సర్జరీ(ఎవేక్ క్రేనియోటమీ) చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. వారి అంగీకారంతో న్యూరో సర్జన్ డా.వినోద్, మత్తువైద్యులు కిరణ్‌కుమార్ సహకారంతో సర్జరీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగానే శస్త్ర చికిత్స నిర్వహించామని డా.రాజేంద్ర స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి బాగుందని, ఆమెను డిశ్చార్జి చేస్తున్నట్లు డా.రాజేంద్ర వెల్లడించారు.


సర్జరీ వివరాలు వెల్లడిస్తున్న డా.రాజేంద్ర, ఇతర వైద్యులు

నేటి నుంచి సబ్సిడీపై నిత్యవసరాల విక్రయం

కలెక్టరేట్: రాష్ట్రంలో నిత్యవసర ధరలు పెరుగుతున్న కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యవసర సరుకులు తగ్గించి బుధవారం నుంచి విక్రయించనున్నామని జేసీ సేతుమాధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా వాసులు వినియోగించుకోవాలని కోరారు.

తగ్గించిన ధరలు ఇలా..

నిత్యవసర వస్తులు	ప్రస్తుత ధర	సబ్సిడీ ధర
టమోట	65	50
కందిపప్పు	150	145
పామాయిల్	123	120
రిఫండ్ ఆయిల్ (ఫ్రీడం)	136	130
రిఫండ్ ఆయిల్ (గోల్డ్ డ్రాప్)	134	128

నల్లమందు స్వాధీనం.. ఒకరి అరెస్టు



నల్లమందు, మాట్లాడుతున్న ఎస్ఐ

రామభద్రపురం: దాబాలో విక్రయిస్తున్న నల్లమందును రామభద్రపురం పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన స్థానికంగా సంచలనం రేపింది. దీనికి సంబంధించి ఎస్ఐ వెలమల ప్రసాద్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూసాయవలస, ఆరికతోట జాతీయ రహదారి పక్కనే ఉన్న రాజస్థాన్ డాబాలో ఈ నెల 7వ తేదీన పోలీసులు ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు చేసి 78 గ్రాముల నల్లమందును స్వాధీనం చేసుకుని రాజస్థాన్ రాష్ట్రం బర్మర్ జిల్లాకు చెందిన రాజేష్ చౌదరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను విచారించగా ప్రతి 3 నెలలకు రాజస్థాన్ వెళ్లి నల్లమందు తెచ్చి లారీ డ్రైవర్లకు విక్రయిస్తున్నట్టు తెలిపాడు. బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు సమక్షంలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మధ్యవర్తులు, హెచ్‌డీటీ గిరిధర్ సమక్షంలో నిందితుడు రాజేష్ చౌదరిని రిమాండ్ నిమిత్తం సాలూరు కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మండలంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల తీరుపై నగరపాలక సిబ్బంది ఆగ్రహం

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి నల్లనయ్యకు వ్యతిరేకంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జేసీకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కమిషనర్‌కు బాసటగా నిలిచారు. సచివాలయ ఉద్యోగులు అసత్య ఆరోపణలతో మంత్రి, జేసీని కలిశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ, నగరంలో పెండింగ్‌లో ఉన్న పన్నుల బకాయిల గురించి కమిషనర్ సమీక్ష సమావేశంలో ప్రశ్నించారని, పన్నుల జాప్యంపై బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారని, దీనిపై రాద్ధాంతం చేస్తూ, సచివాలయ ఉద్యోగులు రోడ్డెక్కడాన్ని ఖండిస్తున్నామన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రేగిడి: మదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు యువత, పెద్దలు దూరంగా ఉండాలని ఎస్ఐ నీలావతి పేర్కొన్నారు. మండలంలో చిన్నశిర్లాం, లచ్చరాయపురం గ్రామాల్లో మంగళవారం సంకల్పం పేరుతో పోలీస్‌లు మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై చైతన్యసదస్సులు, వాహన తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ నీలావతి మాట్లాడుతూ యువత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, ఈ లక్ష్యంలో చెడు అలవాట్ల జోలికి వెళ్లకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎస్.కోట సీఎస్‌డీటీ బాధ్యతల స్వీకరణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎల్.విజయలక్ష్మిని మండల డీలర్లు అభినందించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందించేందుకు సహకరించాలని కోరారు. డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొణదం ఉమా శంకరరావు, సీహెచ్ అప్పారావు, రాణి, రవి తదితరులున్నారు.

వంతెన ఏర్పాటు చేయండి

రేగిడి: మండలంలో పాతచెలిగానవలస వద్ద గ్రామదరి సాయిన్నగెడ్డ వద్ద వంతెన ఏర్పాటుచేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో అనేకమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదులు ఇచ్చినా పరిష్కారం లేదని వాపోతున్నారు. గ్రామం అవతల పంటపొలాలకు వెళ్లాలన్న, మనిషి చనిపోతే దహన సంస్కారాలుకు తీసుకువెళ్లాలన్నా తీవ్ర అసౌకర్యం ఉంటుందని దీనిపై యంత్రాంగం దృష్టి సారించాలని స్థానికులు సూచిస్తున్నారు. ఇటీవల ఈవిషయమై ఎంఎల్ఏ కోండ్రు దష్టికి తీసుకువెళ్లామని, ఆయన హయాంలో ఈసమస్యకు ఒక పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

16 షాపులకు 239 దరఖాస్తులు

కొత్తవలస: కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట మండలాలకు సంబంధించి 16 మద్యం షాపులకుగాను ఇంతవరకు ఆఫ్‌లైన్‌లో 189 దరఖాస్తులు వచ్చాయని కొత్తవలస ఎక్సైజ్ సీఐ రాజశేఖర నాయుడు తెలిపారు. మరికొంత మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు.

రేషన్ డిపోలను క్రమబద్ధీకరించాలి

కలెక్టరేట్: జిల్లాలో ఉన్న రేషన్ డిపోలను క్రమబద్ధీకరించాలని జిల్లా డీలర్లు సంఘ నాయకులు సముద్రపు రామారావు మంగళవారం జేసీ సేతు మాధవన్‌కు విన్నవించుకున్నారు. కార్పొరేషన్, రూరల్ గ్రామాల్లో కనీస స్థాయిలో రేషన్ దుకాణాలు లేవని అయితే ప్రభుత్వం జారీ చేసిన ప్రకారం కార్డులు ఎక్కువ సంఖ్యలో ఉందన్న కారణంతో దుకాణాలు బైఫరికేషన్ చేస్తున్నారన్నారు.

నేడు పైడితల్లి ఉత్సవాలపై 'డయల్ యువర్ ఎంపీ'

విజయనగరం రూరల్: పైడిమాంబ సిరిమానోత్సవ సంబరాలపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు వీలుగా బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకూ 'డయల్ యువర్ ఎంపీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. 94404 36426, 89190 60911, 98499 06486 నంబర్లకు భక్తులు ఫోన్ చేసి మాట్లాడవచ్చన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు సౌకర్యాలు, భద్రతా సౌక ర్యాలు, సిరిమాను ఊరేగింపునకు సంబంధించి విలువైన సలహాలు సూచనలు ఇవ్వవచ్చునని పేర్కొన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్, ఆర్‌డీవో, పైడిమాంబ దేవస్థానం ఈవో పాల్గొంటారని, వారితోనూ మాట్లాడవచ్చన్నారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కలెక్టరేట్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఈవో, సమగ్ర శిక్ష ఏపీసీ ప్రేమకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 55 బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. ఈనెల 7 నుంచి 15 తేదీ వరకూ అర్హత గల అభ్యర్థులు ఆయా మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో అందజేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని టైప్ 3 అసిస్టెంట్ కుక్‌లు 20, డే అండ్ నైట్ వాచ్‌మన్ 5, చౌకీదారులు 6, స్కావెంజర్ 11, స్వీపర్లు 2, టైప్ 4 కేజీబీవీల్లో అసిస్టెంట్ కుక్‌లు 5, చౌకీదారులు 6, హెడ్ కుక్‌లు 2, మొత్తం 55 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాను మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పొందగలరని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ రోస్టర్ అర్హతగా ఎంపిక చేస్తామన్నారు. డే అండ్ నైట్ ఉమెన్ వాచ్‌మన్, చౌకీదార్ పోస్టులకు 7వ తరగతి, మిగిలిన పోస్టులకు విద్యార్హత లేదన్నారు. 18 నుంచి 42 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్ విజేతలను అభినందించిన జేసీ

కలెక్టరేట్: ఈనెల 4, 5, 6 తేదీల్లో రాజమండ్రిలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి 37వ జూనియర్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గణనీయమైన విజయాన్ని సాధించడంతో ఆయా క్రీడాకారులను జేసీ సేతు మాధవన్ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. మొత్తం సాధించిన 20 పతకాల్లో 11 స్వర్ణ, 6 రజిత, 3 క్యాంస పతకాలు గెలుచుకున్నారు. క్రీడలు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని జేసీ తెలిపారు. డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు ఉన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

రాజాం/రూరల్: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చేతుల మీదగా బుధవారం ఉదయం ప్రారంభిస్తున్నట్టు పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమానికి పట్టణ పార్టీ నాయకులు, రూరల్ మండలం నాయకులు వంగర, రేగిడి, సంతకవిటి మండలాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని నంది కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న గిరడ అప్పలస్వామి

బొబ్బిలి: జనసేన పార్టీని బొబ్బిలి నియోజకవర్గంలో మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. ఇందులో భాగంగా పార్టీకి చిరకాలంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారిని గుర్తించి అలాంటి వారికి కీలకమైన బాధ్యతలను అప్పగించామన్నారు. బొబ్బిలి పట్టణ జనసేన కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షునిగా సీనియర్ నాయకుడు లంక రమేష్, మండల పార్టీ అధ్యక్షునిగా అడబాల నాగేశ్వరరావును నియమించామన్నారు. రామభద్రపురం, తెర్లాం మండలపార్టీ అధ్యక్షులుగా మహంతి ధనుంజయ్, బూరి రామకృష్ణనాయుడు, బాడంగి మండల పార్టీ అధ్యక్షునిగా గండేటి శ్రీనివాసరావును నియమించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గస్థాయి వీరమహిళల కోఆర్డినేటర్లుగా పాండ్రంగి ప్రవల్లిక, సవరాల రామలక్ష్మి, బాడంగి ఉషారాణి, బి.లక్ష్మి, పెదపల్లి జ్యోత్స్న, భోగి శోభారాణిని నియమించామన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్న తీరును, ప్రభుత్వ విజయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని పార్టీ బాధ్యులకు వివరించినట్లు అప్పలస్వామి తెలిపారు. పార్టీకి చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారందరినీ కలుపుకోవాలన్నారు. ఆయన వెంట పెద్దింటి మనోజ్‌కుమార్(బాబీ) ఉన్నారు.

పట్టపగలే చోరీ

- వ్యవసాయ పనుల్లో ఉండగా ఇంట్లోకి చొరబాటు

చీపురుపల్లి: మెట్టపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా.. ఇంట్లోకి చొరబడి ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.పది వేల నగదును అపహరించారు. బాధితులు శేషపు కృష్ణ, జయమ్మ అందించిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మెట్టపల్లి గ్రామానికి చెందిన శేషపు కృష్ణ తన భార్య జయమ్మను వెంటబెట్టుకొని ఉదయం 9 గంటల సమయంలో తలుపులకు తాళం వేసి, గ్రామానికి సమీపంలో ఉన్న శివాలయం వద్ద మొక్క జొన్న పంట ఏరివేత పనులకు వెళ్లారు. ఉదయం 9.30 గంటల సమయంలో చేటల కోసం తిరిగి ఇంటికి వచ్చారు. తాళం తీసి, ఇంట్లోకి వెళ్లే సమయంలో ఇంటి వెనుక వైపున ఉన్న తలుపులు తెరచి ఉండడాన్ని గమనించారు. ఇంట్లో టేబుల్ ఫ్యాన్ కింద పడి ఉండడంతో అనుమానం వచ్చి.. వెతకగా కప్‌బోర్డులో ఉంచిన 3.5 తులాల పుస్తెల తాడు, 3.5 తులాల గొలుసు, ఒక్కొక్కటీ అర తులం బరువు గల రెండు ఉంగరాలు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ జరిగిన సంఘటనను అందరికీ వివరించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎల్. దామోదరరావు సంఘటన స్థలాన్ని సందర్శించారు.

కారు, ఆటో ఢీ.. పలువురికి గాయాలు

దత్తిరాజేరు: స్టేషన్ బూర్జివలస గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కారు, ఆటో ఢీకొన్న సంఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ జి.రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కె.కృష్ణాపురం గ్రామానికి చెందిన సావు వరాలమ్మ, పతివాడ కృష్ణమ్మ, చిప్పాడ లక్ష్మి, సుమల సత్యవతి, కళింగపట్నం జితేంద్ర, మంగతుట్టి రాము, కళింగపట్నం బంగారమ్మలు ఆరికతోటలో సొంత పనుల నిమిత్తం వెళ్లి.. ఆటోలో తిరిగిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో వీరంతా గాయపడ్డారు. బాధితులను చికిత్స కోసం గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసుపై విచారణ

దత్తిరాజేరు: మండలంలోని ఒక గ్రామంలో గతంలో నమోదైన పోక్సో కేసుపై పెదమానాపురం పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ చేపటారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, దర్యాప్తు వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. సీఐ రమణ, ఇన్‌చార్జి ఎస్ఐ రాజేష్ ఉన్నారు.

సారా తయారీ దారులపై దృష్టి

కొత్తవలస: మండలంలోని రామలింగపురం గ్రామానికి చెందిన వంటసారా తయారీదారులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు కొత్తవలస ఎక్సైజ్ సీఐ రాజశేఖర నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో రామలింగపురం, అప్పన్నదొరపాలెం గ్రామాలలో సారా తయారీదారులు ఎక్కువగా ఉన్నట్టు సమాచారం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- నలుగురికి గాయాలు

సీతానగరం: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన చినభోగిలి గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు.. ఆర్.వెంకంపేటకు చెందిన వి.సాగర్(20) తన ఇద్దరు స్నేహితులు జి.వరప్రసాద్, జి.పారన్నాయుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం సీతానగరం వచ్చాడు. తన సొంత పనుల కోసం వెల్డింగ్ సామాన్లు తీసుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. చినభోగిలి సమీపంలోకి వచ్చేసరికి.. పాచిపెంట మండలం మాలమామిడి గ్రామానికి చెందిన జి.బాలయ్య మరొకరితో కలిసి బొబ్బిలి నుంచి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తూ వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో సాగర్ తలకు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే సాగర్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మార్గమధ్యంలో చనిపోయినట్లు తెలిపారు. మిగిలిన నలుగురికి గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జి.పారన్నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

తెర్లాం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. రంగప్పవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో సోమవారం రాత్రి నిర్వహించిన తనిఖీలో భాగంగా అతని వద్ద 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ సాగర్‌బాబు తెలిపారు. ఈ వ్యక్తిపైన కేసు నమోదు చేసి రిమాండుకు పంపించామన్నారు.

ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్లు సీజ్

సంతకవిటి: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గోపాలరావు మంగళవారం తెలిపారు. మండలంలోని తమరాం గ్రామ సమీపంలోని నాగావళి నది నుంచి ఇసుకను తరలిస్తుండగా గుళ్ల సీతారాంపురం జంక్షన్ వద్ద ట్రాక్టర్లను ఆపి తనిఖీ చేయగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో డ్రైవర్లపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సంతకవిటి పోలీసు స్టేషన్‌కి తరలించారు.

బస్సు-బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

రామభద్రపురం: మండల పరిధిలోని ముచ్చర్లవలస గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం కోటశిర్లాం గ్రామానికి చెందిన ఆల్తి అశోక్ బైకుపై వస్తుండగా పార్వతీపురం నుంచి విజయనగరంవైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆయనకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని బాడంగి సీహెచ్‌సీకి తరలించి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


సేల్స్ రంగంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే ఆంధ్రజ్యోతి మీకు మంచి అవకాశం కల్పిస్తోంది
మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి కి చందాదారులను చేర్పించటమే
ఆసక్తి ఉత్సాహం గల అభ్యర్థులకు సేల్స్ రంగములో మెళకువలు నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును.
- బుక్‌చేసిన కాపీ ఒక్కింటికి రూ.200/-ల చొప్పున ఇన్సెంటివ్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరూ నెలకు సుమారు రూ. 20.000/- పైన ఆదాయం పొందే అద్భుత అవకాశం.

అర్హతలు
1. వయస్సు : 19-30 సంవత్సరాల యువతీ, యువకులకు అవకాశం.
2. తెలుగులో అనర్గళంగా మాట్లాడగలగాలి.
3. విద్యార్హత : ఎస్.ఎస్.సి. ఆపై...

ఆసక్తిగలవారు ఈ క్రింది ఫోన్ నెంబర్లలను సంప్రదించగలరు.
విజయనగరం : 99854 11533
రాజాం : 94946 91912
పార్వతీపురం : 99854 03035
సాలూరు : 94929 00300
సర్క్యులేషన్ మేనేజర్, శ్రీకాకుళం: 9985411514

ANDHRA JYOTHI AJ CLASSIFIEDS ఆంధ్రజ్యోతి

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం కలదు. జీతం 18K. Ph: 9640258899, 9640468899 AJH-002687

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు: 9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266